

అమిత్‌షా పర్యటన వాయిదా

భగత్‌నగర్, జనవరి 27: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కరీంనగర్ పర్యటన వాయిదా పడిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆది వారం మధ్యాహ్నం కరీంనగర్‌లో కార్యకర్తల సమ్మేళనంలో అమిత్‌షా పాల్గొనాల్సి ఉంది.అయితే అత్యవసర కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉన్నందున అమిత్‌షా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల సమ్మేళనం వాయిదా వేసినట్లు తెలిపారు.తదుపరి సమావేశం వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

స్మార్ట్‌సిటీ పనులు వేగంగా పూర్తి చేయాలి

- పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవు
- జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, జనవరి 27: నగరంలో స్మార్ట్‌సిటీ పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో స్మార్ట్‌సిటీ పనుల పురోగతిపై మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు నగరపాలక సంస్థ పరిధిలో స్మార్ట్‌సిటీ నిధులతో పూర్తిచేసిన, పురోగతిలో, టెండర్, ప్రారంభ దశలో ఉన్న పనుల వివరాలను సమగ్ర నివేదిక రూపొందించి ఇవ్వాలని ఆదేశించారు. పనుల్లో ఆలస్యం జరుగకుండా చూడాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దశలవారీగా పనులన్నింటినీ పూర్తిచేసి వాటిని రికార్డు చేయాలని అన్నారు. పొరపాట్లు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, స్మార్ట్‌సిటీ కన్సల్‌టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

● ఓటరు తుది జాబితాను సిద్ధం చేయండి

త్వరలో జరిగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఖచ్చితమైన ఓటరు తుదిజాబితా సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో చొప్పదండి నియోజకవర్గ బీఎల్‌వోలతో ఓటరు జాబితా తయారీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ కూడా తప్పులు జరుగకుండా ఓటరు తుది జాబితాను తయారు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించాలన్నారు. హోం ఓటింగ్‌కు దివ్యాంగుల, వయోవృద్ధుల వివరాలను సేకరించాలని తెలిపారు.



సమన్వయం ఎవరి 'చేతి'లో

- కాంగ్రెస్‌లో అధికార కేంద్రం కరువు
- జిల్లా మంత్రులకు ఇతర జిల్లాల బాధ్యత
- స్థానిక ముఖ్య పదవులన్నీ బీఆర్ఎస్, బీజేపీ చేతుల్లో

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో అధికార కేంద్రం కరువైంది. కరీంనగర్ ఎంపీగా బీజేపీకి చెందిన ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తుండగా జిల్లా కేంద్ర శాసనసభ్యుడిగా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఉన్నారు. జిల్లాలో ఉన్న ఏకైక మున్సిపల్ కార్పొరేషన్‌కు బీఆర్ఎస్‌కే చెందిన సునీల్‌రావు మేయర్‌గా ఉండగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కనుమల్ల విజయ అధికారంలో ఉన్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లోని రెండింటిని కాంగ్రెస్ కైవసం చేసుకోగా మరో రెండు బీఆర్ఎస్ పరమయ్యాయి. ఉమ్మడి జిల్లా నుంచి గెలుపొంది మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్, డి.శ్రీధర్‌బాబును ఇతర జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులుగా కేటాయించి, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని నియమించారు. అధికార కేంద్రాల్లో బీఆర్ఎస్, బీజేపీ ప్రతినిధులే ఉండడం, పదేళ్లుగా కాంగ్రెస్ అధికారంలో లేక పోవడంతో ముఖ్యనాయకులు కొన్ని నియోజకవర్గాల్లో ద్వితీయశ్రేణి నేతలు కూడా ఇతర పార్టీలకు వలసపోయారు. దీనితో జిల్లాలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా జిల్లా కేంద్రంలో ఆ పార్టీని సమన్వయపరిచి సరైన దిశానిర్దేశం చేసే పవర్‌సెంటర్ లేకుండా పోయిందని పార్టీశ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. హుస్నాబాద్ నియోజకవర్గం లోని చిగురుమామిడి, సైదాపూర్ మండలాలు జిల్లాలో ఉండడంతో పాటు ఆయన నివాసం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉండడంతో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఇక్కడికి వస్తూ పోతూ ఉన్నా పూర్తిగా జిల్లా రాజకీయాలపై దృష్టిసారించే అవకాశం లేకుండా పోతున్నది. తాను కొత్తగా పోటీచేసి గెలుపొందిన హుస్నాబాద్ నియోజకవర్గంపై పట్టుసాధించి స్థిరపడడానికి ఆయన ఆ నియోజకవర్గంపైన ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరముండడం, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా ఉండడంతో అక్కడి సమయం కేటాయించాల్సి రావడం కారణంగా జిల్లాకు సమయం కేటాయించే అవకాశం తక్కువేనని భావిస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలోని 16 మండలాల్లో రెండు మండలాల ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి జిల్లా రాజకీయాలను నిర్వహించడమేమిటనే అభిప్రాయం కలుగకుండా ఉండేందుకు హుస్నాబాద్ నియోజకవర్గ మండలాలను కరీంనగర్‌లో కలిపి మంత్రి ప్రభాకర్‌ను జిల్లా పవర్‌సెంటర్‌గా మార్చితే సమంజసంగా ఉంటుందనే అభిప్రాయం కూడా వినిపిస్తున్నది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మానకొండూర్ శాసనసభ్యుడిగా గెలుపొందారు. ఆయనకు రాష్ట్రస్థాయి పదవిని ఏదైనా కట్టబెట్టి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగిస్తే పవర్‌సెంటర్‌గా మారే అవకాశముంటుందని లేనిపక్షంలో జిల్లాలో అందరితో సత్సంబంధాలుండి పార్టీ నాయకులను, శ్రేణులను సమన్వయపరిచి ముందుకు సాగే నేతను గుర్తించి డీసీసీ అధ్యక్ష బాధ్యతలతో పాటు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవి అప్పగిస్తే బాగుంటుం దనే అభిప్రాయం శ్రేణుల్లో వ్యక్తమవుతున్నది. అధికార పార్టీ కరీంనగర్ పవర్‌సెంటర్‌గా ఎవరిని కూర్చోబెడుతుందో ఇక్కడి రాజకీయాలను ఎవరు సమన్వయపరుస్తారో అన్న ప్రశ్నకు సమాధానం కోసం ఆ పార్టీ నాయకులు, శ్రేణులే కాకుండా అన్ని రాజకీయపార్టీల నాయకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

హక్కుల కోసం పోరాడే స్వేచ్ఛను టీఎన్జీవోలు కోల్పోయారు

- ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం
- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



టీఎన్జీవో డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం

సుభాష్‌నగర్, జనవరి27: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత టీఎన్జీవో నాయకులు తమ హక్కుల కోసం పోరాడే స్వేచ్ఛను కోల్పోయారని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం రాత్రి కరీంనగర్‌లో జిల్లా టీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాటా ్లడుతూ 75 సంవత్సరాల టీఎన్జీవో రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉందని చెపుతుంటే విడ్డూరంగా ఉందన్నారు. టీఎన్జీవో నాయకులు తమ కుటుంబ సభ్యులు అని అన్నారు. 36 ఏళ్లుగా నమ్మిన సిద్ధాంతం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ కాంగ్రెస్ పార్టీలో నేడు ఈ స్థాయికి చేరానన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసినపుడు, ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసిన సమయంలో టీఎన్జీవో నాయకులు మద్దతుగా ఉద్యమించవలసి ఉండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రతినిధిగా ఉద్యోగ సంఘాల సమస్యల గురించి ముఖ్య మంత్రి వద్ద ప్రస్తావిస్తానని, సమస్యలు పరిష్కారం అయ్యేందుకు చొరవ చూపుతానన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ముందుకు తీసుకు పోవడానికి అధికారులు ఎక్కడా నిర్లక్ష్యం వహించకూడదని విజ్ఞప్తి చేశారు. అనం తరం టీఎన్జీవో నాయకులు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంత్రి పొన్నంతో టీఎన్జీవోకు ఎనలేని అనుబంధం ఉందన్నారు. తన పోరాటంతో తెలంగాణ పదాన్ని దేశానికి పరిచయం చేసిన వ్యక్తి పొన్నం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి సంఘం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం

సకలజనుల సమ్మె ద్వారానే తెలంగాణ వచ్చిందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడచిన పదేళ్ల కాలంలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం ఏనాడూ జరగలేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత స్వేచ్ఛగా సమస్యలు చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. పదేళ్లలో ఎన్నో కష్టాలు చూశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియంతలా వ్యవహరించదని అన్నారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వేచ్ఛ వచ్చిందన్నారు తెలం గాణ ఉద్యమంలో కేసులు ఎఫ్ఐఆర్‌లు నమోదైన వారికి న్యాయం చేస్తామ న్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరు స్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఓటింగ్ శాతం పెంచాలి

- ఏప్రిల్ 15వరకు బూత్‌స్థాయి సమావేశాలు
- కలెక్టర్ పమేలా సత్పతి



కలెక్టర్ పమేలా సత్పతి


కరీంనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార ్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారి స్వీప్ యాక్టివిటీ క్యాలెండర్‌ను రూపొందించారని చెప్పారు. జనవరి 26 నుంచి మూడు నెలల కోసం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో స్వీప్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జనవరి 27 నుంచి ఏప్రిల్ 15వరకు బూత్ స్థాయి సమావేశాలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో పనిచేస్తున్న వారితోపాటు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్, గేటెడ్ కమ్యూనిటీలు, యువకులు, మహిళలు, థర్డ్‌జెండర్‌లు, పిడబ్ల్యూడి, సీనియర్ సిటిజన్లతో స్వీప్ అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రత్యేక అధికారులను కేటాయించారని అన్నారు. ఫిబ్రవరి 5వరకు గ్రామసభలు, వివిధ శాఖల ద్వారా ఓటరు అవగాహన కార్యక్రమాలు, ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15వరకు అన్ని మున్సిపాలిటీల్లో అవగాహన కార్యక్రమాలు, 8న మండల కేంద్రాల్లో 2కె రన్, ఫిబ్రవరి 23న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బైక్, సైకిల్ ర్యాలీ, 29న కైట్ ఫెస్టివల్, ఫిబ్రవరి 6నుంచి 29వరకు ప్రత్యేక మహిళా స్వయం సంఘాలతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. మార్చి 5న అన్ని మండల కేంద్రాల్లో, 13న అన్ని మున్సిపాలిటీల్లో రంగోళి పోటీలు, ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 15వరకు అన్ని గ్రామపంచాయతీలు, మండలాల్లో మున్సిపాలిటీల్లో ఓటు ప్రాముఖ్యత వివరించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్లు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రభుత్వ అధికారులు పాల్గొంటారని అన్నారు.

శివలింగంపై నాగుపాము

- హుజూరాబాద్ రామాలయంలో ఘటన



హుజూరాబాద్, జనవరి 27: హుజూరాబాద్ పట్టణంలోని రామాలయం ఆవరణలో ఉన్న శివలింగంపై శనివారం నాగుపాము కనిపించింది. ఉదయం రామాలయంలోకి అర్చకులు వచ్చి చూడగా శివలింగంపై నాగుపాము పడగ విప్పి కనిపించింది. దీంతో చుట్టు పక్కల వారు వచ్చి దేవుడి ప్రతిరూపంగా భావించి మొక్కుకున్నారు. కొంత మంది భక్తులు వచ్చి పూజలు చేశారు. ఎక్కువగా భక్తులు రావడంతో అక్కడి నుంచి నాగుపాము వెళ్లిపోయింది. శివలింగంపై నాగుపాము పడగ విప్పి ఉన్న దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



ఇష్టారాజ్యం

- జనం సొమ్ముతో చిట్‌ఫండ్స్ రియల్‌ఎస్టేట్ వ్యాపారం
- సభ్యులకు బలవంతంగా స్థలాల కేటాయింపు
- ఆరు నెలలైనా అందని డబ్బులు
- సభ్యుల డబ్బులు చెల్లించకుండానే చిట్‌ఫండ్స్ డిపాజిట్స్ వాపసు
- ఇప్పటికే ఒక అధికారి సస్పెన్షన్
- పోలీస్ కమిషనర్‌కు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

కరీంనగర్ క్రైం, జనవరి 27: పిల్లల చదువులు, ఆసుపత్రి అవసరాలు, కూతురు వివాహం, ఇంటి స్థలం కొనుగోలు ఇలా ఎవరి అవసరాలకు వారు.. సామాన్య, మధ్యతరగతి ప్రజలు చిట్‌ఫండ్స్‌లను నమ్మి చిట్ వేసి ఎత్తుకుంటే ఆరు నెలలు, సంవత్సరం గడిచినా డబ్బులు చేతికి రావడం లేదు. కొన్ని చిట్‌ఫండ్స్ సభ్యుల డబ్బులతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. చిట్ సభ్యుల డబ్బులతో భూములను కొనుగోలు చేసి వెంచర్లుగా చేసి విక్రయాలు చేపడుతున్నాయి. అయితే చిట్స్ బిడ్ పూర్తి అయిన తరువాత సభ్యులకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించకుండా జాప్యం చేస్తూ చివరకు వారి వెంచర్‌లో స్థలం తీసుకోవాలంటూ తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. చిట్ బిడ్ పూర్తి అయి అప్పటికే 6 నెలలు, ఏడాది కాలం గడవటంతో పాటు డబ్బులు ఇవ్వకుండా తింపుకోవటం, చిట్ రిజిస్ట్రార్ అధికారుల వద్దకు వెళితే మా చేతిలో ఏమీ లేదని, జీరో చిట్‌లకు తాము ఏమీ చేయలేమని చెప్పటంతో బాధిత సభ్యులు బలవంతంగా స్థలాలను తీసుకునేందుకు అంగీకరిసు ్తన్నారు. అయితే వాస్తవానికి ఉన్న ధరకు రెట్టింపు లెక్కతో స్థలాలను అంటగడుతూ చిట్ బిడ్ డబ్బులు మినహా మరిన్ని డబ్బులు సభ్యుల నుంచి వసూలు చేస్తున్నారు. ఇలా జిల్లాలో చిట్‌ఫండ్స్ అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

మామూళ్ల మత్తులో చిట్ రిజిస్ట్రార్ అధికారులు

చిట్ సభ్యులకు ఆర్‌బీఐ గైడ్‌లైన్స్ ప్రకారం డబ్బులు చెల్లించేలా, చిట్‌ఫండ్స్‌లో జీరో చిట్స్ దందాను అరికట్టి ప్రభుత్వా దాయాన్ని పెంచాల్సిన చిట్ రిజిస్ట్రార్ శాఖ కంచె చేను మేసిన చందంగా అక్రమార్కులతో చేయికలిపి మామూళ్ల మత్తులో జోగుతున్నారని, దీంతో చిట్ సభ్యులు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. చిట్‌ఫండ్స్ లావాదేవీలు నిబం ధనల ప్రకారం నిర్వహించేలా, సభ్యులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చిట్ డబ్బులు నిర్దేశించిన కాల వ్యవధిలో చెల్లించేలా చర్యలు తీసుకోవాల్సిన చిట్ రిజిస్ట్రార్ అధికారులు చిట్‌ఫండ్స్ నిర్వాహకులు ఇచ్చే నజరానాలకు ఆశ పడి వారికి అనుకూలంగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలానా చిట్‌ఫండ్స్‌లో మోసం జరిగిందని, తనకు రావాల్సిన డబ్బులు సకాలంలో చెల్లించడం లేదని ఎవరైనా సభ్యుడు చిట్ రిజిస్ట్రార్ అధికారుల వద్దకు వెళితే కనీసం ఫిర్యాదు తీసుకోవడం లేదని, ఫిర్యాదు చేస్తే ఏమొస్తుంది? వారితో మాట్లాడిస్తా.. పరిష్కరించుకో అని ఉచిత సలహా ఇస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. చిట్‌ఫండ్స్ యాజమాన్యం తమ చిట్ డబ్బులు ఇవ్వకుండా ఏడాది కాలంగా తిప్పుకుంటున్నారని పదుల సంఖ్యలో పోలీస్‌కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదులు అందాయి. ఇందులో మూడు చిట్‌ఫండ్స్‌పై రెండో ఠాణా పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసు కమిషనర్ తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

● కరీంనగర్‌లోని కొన్ని చిట్‌ఫండ్స్‌కు సంబంధించిన చిట్ మార్టిగేజ్ ఆస్తులను రిలీజ్‌లో చాలా అక్రమాలు చోటు చేసుకున్నాయి. చిట్ గ్రూపులోని మొత్తం సభ్యులకు చిట్ డబ్బులు చెల్లించిన తరువాతనే ఆ గ్రూపు పేరిట నగదు రూపంలో ఉన్న డిపాజిట్ లేదా ఆస్తి మార్టిగేజ్‌ను తిరిగి చిట్‌ఫండ్స్‌కు చెల్లించాల్సి ఉంది. కానీ చిట్‌ఫండ్స్ నిర్వాహకులతో కుమ్మక్కైన అధికారులు చిట్ సభ్యులందరికీ చిట్ డబ్బులు చెల్లించకుండానే ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను రిలీజ్ చేశారు. ఈ కేసులో ఇటీవల ఒక ఇన్‌చార్జి చిట్ రిజిస్ట్రార్ సస్పెండ్ అయ్యారు.

● జీరో చిట్స్‌తో మోసపోతున్న జనం

చిట్‌ఫండ్స్, ఫైనాన్స్‌ల నిర్వహణ, లావాదేవీలను చట్ట బద్ధం చేయడానికి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ కార్యాలయం పని చేస్తుంటుంది. చిట్‌ఫండ్స్‌లో నిర్వహించే అన్ని చిట్స్‌ను చట్టబద్ధం చేయడానికి ప్రత్యేకంగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక చిట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉన్నారు. జిల్లాలోని అన్ని చిట్‌ఫండ్స్ ఫైనాన్స్‌లలో ఆర్థిక లావాదేవీలు చట్టబంద్ధంగా జరిగే విధంగా చూడటం చిట్స్ సబ్‌రిజిస్ట్రార్ బాధ్యత. అక్రమాలు చోటు చేసుకుంటే ఆ సంస్థ రిజిస్ట్రేషన్ రద్దు చేయడమే కాకుండా సంస్థకు చెందిన ఆస్తులను సీజ్ చేసి బాధితులకు చెల్లించే విధంగా న్యాయం అందించే అధికారం చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు, జిల్లా రిజిస్ట్రార్‌లకు ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా చిన్నా, పెద్దవి కలిసి దాదాపు 100వరకు చిట్‌ఫండ్స్‌లు ఉంటాయి. ఈ చిట్‌ఫండ్స్‌లలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి లావాదేవీలకు చట్టబద్ధత కల్పించే విధి చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అధికారులదే. కానీ ఏనాడూ జిల్లాలోని ఏ ఒక్క చిట్‌ఫండ్స్‌లకు తనిఖీల కోసం వెళ్లడం లేదు. చిట్‌ఫండ్స్ నిర్వాహకులే ప్రతి నెల వారి ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలతో కూడిన పత్రాలను రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ కార్యాలయం తీసుకువచ్చి తాము రిజిష్టర్ అయిన చిట్స్‌నే నడుపుతున్నామని మినిట్స్ సమర్పిస్తున్నారు. ఈ రికార్డులతో పాటే ప్రతినెలా క్రమం తప్పకుండా కవర్లు అందిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారికంగా నామమాత్రపు చిట్స్‌ను రిజిష్టర్డ్‌గా పేర్కొంటున్న చిట్‌ఫండ్ సంస్థలు అంతకు రెట్టింపు సంఖ్యలో జీరో చిట్స్‌ను నడుపుతున్నాయని ఆరోపణలున్నాయి. అయితే ఈ విషయం చిట్స్ డబ్బులను సభ్యులకు చెల్లించే సమయంలో వచ్చిన తేడా సందర్భంలో బయటపడుతున్నాయి. అప్పుడు అధికారులే బాధ్యులను ఎదురు ప్రశ్నిస్తున్నారు. రిజిస్టర్డ్ చిట్ నిర్ధారించుకోకుండా ఎలా చిట్ సభ్యుడిగా చేరావు? అని ప్రశ్నిస్తూ బాధితులను ఫిర్యాదు చేయకుండా అడ్డుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. యాక్షన్ పూర్తి చేసిన తరువా త, అన్ని ష్యూరిటీలు సమర్పించిన 45 రోజుల్లో చిట్ బిడ్ డబ్బులు సభ్యుడికి చెల్లించాల్సి ఉంటుంది. అవసరమైన అన్ని పత్రాలు, సంతకాలు, ష్యూరిటీలు తీసుకురావాలని చెప్పకుండా ఉద్దేశపూర్వకంగా ఒకటి తరువాత మరొకటి పత్రం కావాలంటూ 3 నుంచి 4 నెలలు గడుపుతూ తీవ్ర జాప్యం చేస్తున్నారని చిట్ సభ్యులు వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 27: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతోపాటు చిన్నారికి తీవ్రగాయాల య్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వీర్నపల్లి మండలం భూక్య తండాకు చెందిన దంపతులు పద్మ- సురేశ్‌తోపాటు మూడు నెలల బాబు బైక్‌పై సిరిసిల్ల ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తున్నారు. సిద్దిపేటలో ఏఆర్ ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నిజామాబాద్ జిల్లాకు చెందిన లక్ష్మీనర్సాగౌడ్ కారులో ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్నాడు. హరిదాస్‌నగర్ బస్టాండ్ వద్ద బైక్‌ను కారు ఢీకొట్టడంతో పద్మ- సురేశ్‌తోపాటు బాబుకు తీవ్రగాయాల య్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

30 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

వేములవాడ, జనవరి 27: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరా జేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 30వ తేదీ నుంచి త్యాగరాజ స్వామివారి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నారు. త్యాగరాజ స్వామివారి 71వ ఆరాధనోత్సవాల నిర్వహణ కోసం ఆలయ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 30వ తేదీ మంగళవారం నుంచి ఫిబ్రవరి మూడవ తేదీ శనివారం వరకు ఐదు రోజులపాటు త్యాగరాజ స్వామి వారి ఆరా దనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ అధికారులు ఒక ప్రకట నలో తెలిపారు. ఉత్సవాలలో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన కళాకా రులు సంగీత కచేరీలు, నృత్య ప్రదర్శనలతో కళాభిమానులను అలరిస్తారని వారు వెల్లడించారు.

రాజన్న క్షేత్రంలో కొనసాగుతున్న రద్దీ



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

- మూడు రోజులపాటు గర్భాలయ ప్రవేశం రద్దు

వేములవాడ, జనవరి 27: వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోం ది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన శ్రీరాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుని శ్రీస్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. బాలాత్రిపురాసుందరీదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమపూజ, కళాభవన్‌లో శ్రీస్వామివారి నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు అమ్మ వారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించు కున్నారు. మేడారం సమ్మక్క, సారక్క జాతర సమీపిస్తున్న తరుణంలో గత కొద్ది వారాలుగా ప్రతినిత్యం వేలాదిమంది భక్తులు వేములవాడకు తరలివస్తున్న క్రమంలో రద్దీ మరింత పెరుగుతుండడంతో శని, ఆది సోమవారాలలో శ్రీస్వామివారి గర్భాలయ ప్రవేశాన్ని రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం, సోమవారం కూడా శ్రీ స్వామివారి గర్భాలయంలో అభిషేక పూజల భక్తులను అనుమతించమని ఆలయ అధికారులు వెల్లడించారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ



నరసింహుడి ఆలయంలోకి క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

ధర్మపురి, జనవరి 27: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. అభిషేకాది పూజలు, అర్చన లు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించారు. యాగశాల వద్ద లోక క్షేమార్థం నరసింహ హోమం జరిపారు. ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కరీంనగర్‌కు హైకోర్టు న్యాయమూర్తుల రాక

కరీంనగర్ లీగల్, జనవరి 27: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కరీంనగర్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ పి.శ్రీసుధ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఇవి వేణుగోపాల్‌రావు కరీంనగర్ జిల్లా కోర్టుకు ఆదివారం రానున్నారు. కరీంనగర్ జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఐదవ అదనపు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (జువైనల్ కేసులు) కోర్టు ప్రారంభోత్సవం చేయనున్నారు. వారితో పాటు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి బి ప్రతిమ, ఇతర న్యాయమూర్తులు పాల్గొననున్నారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజులు ఒక ప్రకటనలో కోరారు.

రాజన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



జస్టిస్ శ్రీనివాసరావుకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో

వేములవాడ, జనవరి 27: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మాధవిదేవి, జస్టిస్ శ్రీనివాసరావు దర్శించుకున్నారు. శనివారం వారు శ్రీ స్వామి వారి దర్శనం కోసం కుటుంబ సమేతంగా వేములవాడకు చేరుకున్నారు.ఆలయ అర్చకులు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ స్థానాచా ర్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ఆశీర్వచనము గావించారు. ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్ శ్రీ స్వామివారి ప్రసాదం అందజే శారు. సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల జడ్జిలు ప్రేమలత, నీలిమ, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీవో మధుసూదన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

జాతరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు

- రాజన్న ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్

వేములవాడ, జనవరి 27: శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానం దత్తత ఆలయమైన కోనరావుపేట మండలం మామిడిపల్లిలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో ఫిబ్రవరి 9న నిర్వహించే మాఘ అమావాస్య జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ అన్నారు. ఆలయ అతిథి గృహంలో శనివారంనిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవస్థానం తరపున తగిన ఏర్పాట్లు చేస్తామని అన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు తగిన బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. సమావేశంలో వేములవాడ ఆర్డీవో పులి మధుసూదన్, కోనరావుపేట ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సెస్ వైస్ చైర్మన్ డి తిరుపతి, మామిడిపల్లి సర్పంచ్ కొక్కుల భారత నర్సయ్య, ఎంపీడీవో రామకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్, శ్రీరాములు, ఆలయ ఇన్‌చార్జి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత్ సమ్మేళన్‌కు ఐదు రాష్ట్రాల కోఆర్డినేటర్‌గా ఎస్ కుమార్



ఎస్ కుమార్

గోదావరిఖని, జనవరి 27: బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో నా గపూర్, ఆగ్రాలలో జరగనున్న దళిత్ సమ్మేళన్‌కు ఐదు రాష్ట్రాల కోఆర్డినేటర్‌గా బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్‌నిర్మల్ లేఖ విడుదల చేశారు. నాగపూర్, ఆగ్రాలలో జరగనున్న కార్యక్రమాలకు 25వేల మంది ప్రతినిధులు హాజరయ్యేలా ప్రణాళికలు చేస్తున్నారు. అన్ని రాష్ట్రాల ఎస్సీ మోర్చా కమిటీలు, జిల్లా కమిటీలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు ఈ సమ్మేళన్‌కు హాజరుకానున్నారు. ఇందుకు గాను సమన్వయానికి బాధ్యతలు అప్పగించారు. ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి అయిన ఎస్ కుమార్‌కు ఏపీ, తెలంగాణ, పాండిచ్చేరి, కర్ణాటక, కేరళ, తమిళనాడు బాధ్యతలు అప్పగించారు.

భార్యను వేధించిన వ్యక్తికి జైలు శిక్ష

కరీంనగర్ లీగల్, జనవరి 27: అదనపు కట్నం కోసం భార్యను వేధించడమే కాకుండా, గుడిసెను తగులబెట్టిన కేసులో చెక్కల శివకృష్ణ (25) అనే వ్యక్తికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 30 వేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మికుమారి శనివారం తీర్పునిచ్చారు. ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాత్మానగర్ చాపలకాలనీకి చెందిన దివ్య (21) అదే కాలనీకి చెందిన చెక్కల శివకృష్ణలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. మూడు సంవత్సరాలు భార్యతో కలిసి కాపురం చేసిన శివకృష్ణ ఐదు లక్షలు అదనపు కట్నం కావాలని వేధించడంతో పాటు, 2022 అక్టోబర్ 10న అత్తమామలు నివాసం ఉండే గుడిసెను తగులబెట్టాడు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు సాక్షులను కోర్టులో హాజరుపరిచి విచారించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి శివకృష్ణకుక జైలు శిక్ష విధించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంగాధర, జనవరి 27: గంగాధర మండలం రంగారావుపల్లికి చెందిన గంగాధర ప్రశాంత్(30) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గంగాధర ప్రశాంత్ డిప్లొమా పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ఈనెల 25న తనకు సమస్యలున్నాయట్లు గట్టుబూత్కుర్ శివారులో పురుగుల మందు తాగి తన అన్న ప్రవీణ్‌కు ఫోన్ చేశాడు. ప్రవీణ్ తన స్నేహితుడితో కలిసి వెళ్లి చూడగా గుర్తు తెలియని పురుగుల మందు తాగి పడి ఉన్నాడు. కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తుండగా ఈ రోజు పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి లచ్చయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న రైతులు

మానకొండూర్, జనవరి 27: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో శనివారం మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లను రైతులు అడ్డుకున్నారు. అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన 15 మంది రైతుల వ్యవసాయ భూములలో మట్టిని తీసుకునేందుకు గాను జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్టర్ ఎకరానికి రూ. 68వేల ఒప్పందం కుదుర్చుకున్నారు. 45 రోజులకు నగదు చెల్లిస్తామని చెప్పి మూడు నెలలు దాటినా డబ్బులు ఇవ్వలేదని ఆగ్రహిస్తు టిప్పర్‌లను అడ్డుకొని నిరసన తెలిపారు. రోడ్డు పనుల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని రెండుమూడు రోజుల్లో నగదు చెల్లిస్తామని చెప్పడంతో రైతులు వెళ్లిపోయారు.

జన సంద్రం

● కొండగట్టుకు పోటెత్తిన భక్తులు ● రోజంతా నిరంతర దర్శనం



దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



కొండగట్టు ఆలయ పరిసరాల్లో భక్తులు

మల్యాల, జనవరి 27: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో పోటెత్తింది. కొండంతా భక్తజనంతో కిక్కిరిసింది. వచ్చే నెలలో జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతన నేపథ్యంలో ముందుగా దేవుళ్లను దర్శించుకుంటుండగా వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. సీతమ్మ కన్నీటి గుంతల వరకు వరుస కట్టారు. ఆలయ పరిసరాలు, ఆలయ ప్రధాన కార్యలయం భక్తులతో నిండిపోయింది. వాహనాలను బొజ్జ పోతన్న ఆలయం వద్ద నిలిపివేశారు. ఘాట్‌రోడ్డు నుంచి కిందకు వచ్చే వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. భక్తులు ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. దాదాపు ముప్పై వేలకు పైగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో శ్రీనివాస్ ఇతర అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా నిరంతరంగా కొనసాగింది. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, బొజ్జపోతన పరిసరాలు నిండిపోయాయి.

పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయం

- జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 27: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు, పెద్దపల్లి జిల్లా విద్యాధికారి మాధవి, మంథనికి చెందిన ప్రవాసభారతీయుడు డాక్టర్ అశోక్ కాచే అన్నారు. శనివారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో బేసిక్ రిసెర్చ్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ (బ్రెడ్) సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో విద్యార్థులకు పుస్తక పఠనం, గ్రంథాలయ నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈవోలు మాట్లాడుతూ రాష్ట్రంలో 610 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 130 బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కాచే సేవలను కొనియాడారు. ఈసమావేశంలో బ్రెడ్ సొసైటీ ఉపాధ్యక్షులు విజయ్ సాయి మేఖ, శశి భూషణ్ కాచె, శ్రీనివాస్ కాచె, వరహాల శ్రీనివాస్, 80 పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై మోసం చేసిన వ్యక్తిపై కేసు

మెట్‌పల్లి, జనవరి, 27: మెట్‌పల్లి పట్టణ అనుసంధ గ్రామమైనా వెంకట్‌రావుపేట గ్రామానికి చెందిన యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్‌రావుపేట గ్రామానికి చెందిన వివాహితకు కొంతకాలం క్రితం వివాహమైంది. అనంతరం విడాకులు తీసుకుని ఇంట్లోనే ఉంటోంది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో నిజామాబాద్ జిల్లా నవీపేట్ గ్రామానికి చెందిన ఈశ్వర్ అను వ్యక్తి రెండేళ్ల క్రితం పరిచయమయ్యాడు. కాగా కొన్ని రోజుల నుంచి వీరి మధ్య ప్రేమాయణం కొనసాగింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఈశ్వర్ ఆమె వద్ద నుంచి లక్ష రూపాయల వరకు తీసుకున్నాడు. కొద్ది రోజులుగా పెళ్లి చేసుకోవాలని వివాహిత కోరుతున్నా మాట దాటువేస్తూ కాలం వెళ్లదీసాడు. దీ తో మోసపోయినట్లు గుర్తించిన వివాహిత ఈశ్వర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్‌పై వచ్చి పుస్తెలతాడు దొంగిలించిన ఇద్దరి రిమాండ్



పోలీసులకు రివార్డు అందజేసిన ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 27: బైక్‌పై వచ్చి పుస్తెలతాడు దొంగిలించి పరారైన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని పెద్దగుండవెల్లికి చెందిన బోదాసు నరేశ్ (30), పద్మనాభంపల్లికి చెందిన సిద్ధన యాదవ్వ (33)ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన రుద్రాపు పోషవ్వ అనే వృద్ధురాలు జ్వరంతో బాధపడుతూ ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని జంట బైక్‌పై వచ్చింది. ఇంటివద్ద దింపుతామని నమ్మించి ఆమె మెడలోని పుస్తెల తాడును తెంపుకొని పారిపోయింది. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ విచారణ చేపట్టారు. ప్రత్యేక బృందం ద్వారా జిల్లెల్ల, నేరెళ్ల, ముస్తాబాద్ ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను పరిశీలించారు. వాటి ఆధారంగా శుక్రవారం సాయంత్రం బద్దెనపల్లి క్రాస్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న బోదాసు నరేశ్, సిద్ధన యాదవ్వను అదుపులోకి తీసుకొని విచారించగా దోపిడీ వ్యవహారం బయటపడింది. సులువుగా డబ్బులు సంపాదించవచ్చని దోపిడీలకు పాల్పడుతున్నట్లు వారు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు చెప్పే మోసపూరిత మాటలను నమ్మవద్దని అన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఆర్ఎస్సై జునైద్, కానిస్టేబుళ్ళు నరేందర్, రాజశేఖర్, శ్రీనివాస్, అక్తర్‌కు రివార్డు అందజేశారు.

ప్రారంభమైన జేఈఈ మెయిన్

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలు



విద్యార్థుల పత్రాలను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్/రామగిరి, జనవరి 27: దేశవ్యాప్తంగా వివిధ ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే తొలివిడ త జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రం, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కరీంనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ అండ్ పీజీ, వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, వాణినికేతన్ డిగ్రీ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. రామగిరి మండలంలోని సెంటినరీకాలనీ జేఎన్‌టీయూలో జేఈఈ మెయిన్స్ ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 93 మంది, మధ్యాహ్నం 92 మంది పరీక్షలకు హాజరయ్యారు.ఉదయం 9 నుంచి 12గంటల మొదటి సెషన్‌లో 1,309మందికి 1,297మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. రెండో సేషన్‌లో మధ్యాహ్నం 3నుంచి 6గంటల వరకు 1,309 మందికి 1,301మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ఫిబ్రవరి 1వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రెండు గంటల ముందు నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. విద్యా ర్థులను క్షుణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోనికి అనుమ తిం చామని ఎన్‌టీఏ సీటీ కోఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు.

స్వగ్రామం చేరుకున్న మృతదేహం

చందుర్తి, జనవరి 27: చందుర్తి మండల కేంద్రానికి చెందిన కైర నాగయ్య (55)అనే వ్యక్తి సౌదీ అరేబియాలో మృతి చెందగా శనివారం మృతదేహం స్వగ్రామానికి తీసుకొచ్చారు. నాగయ్య జీవనోపాధి కోసం 30 సంవత్సరాలుగా గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. 10 సంవత్సరాల క్రితం సౌదీ వెళ్లిన నాగయ్యకు 20 రోజులు క్రితం పక్షవాతం వచ్చింది. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు.

పశుగ్రాసం దగ్ధం

ఓదెల, జనవరి 27: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో శనివారం ఎంబాడి సమ్మయ్య అనే రైతుకు చెందిన పశుగ్రాసం కుప్ప నిప్పంటుకొని దగ్ధమైంది. రెండు నెలల క్రితం రైతు కొంత భూమిని కౌలుకు తీసుకుని వరి పంట వేసి పంటను పూర్తి చేసుకోగా అనంతరం మిగిలిన నాలుగు ఎకరాల గడ్డిని కుప్పగా పేర్చాడు. ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. సమీపంలోని ప్రజలు అక్కడికి చేరుకుని నీరు పోసి మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది.

రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన కేసులో మరో ముగ్గురి అరెస్టు

హుజూరాబాద్, జనవరి 27: హుజూరాబాద్ పట్టణంలో నాలుగు రోజుల క్రితం రేషన్ బియ్యం అక్రమ నిల్వ చేసిన కేసులో పరారిలో ఉన్న ముగ్గురిని టౌన్ సీఐ బొల్లం రమేశ్ అరెస్టు చేసినట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల క్రితం 250 క్వింటాళ్ల రేషన్ బియ్యం మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన కేసులో ఏ1గా ఉన్న శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామనరి చెప్పారు. కాగా పరారిలో ఉన్న ముగ్గురు బోర్నపల్లికి చెందిన పిల్లి శ్రీధర్, శంకరపట్నం మండలం మెట్‌పల్లికి చెందిన అంగిడి రమేష్, ఇల్లందకుంట మండలం మల్యాలకు చెందిన తిరుపతి సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

ఇసుక లారీల తనిఖీ

మంథని, జనవరి 27: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజ్‌ఎల్ల వద్ద మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి పై ఇసుకల లారీలను, టిప్పర్లను టీఎస్ఎండీసీ అధికారులు శనివారం రాత్రి తనిఖీ చేశారు. మంథని, ముత్తారం మండలాల్లోని వివిధ ఇసుక క్వారీల నుంచి రవాణా అవుతున్న ఇసుక లారీలు, టిప్పర్లను టిఎస్ఎండీసీ ఎస్ఆర్‌వోలు రాజుకుమార్, అరవింద్ తనిఖీలు చేపట్టారు.

క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, జనవరి 27: తెలంగాణ షార్ట్ ఫిలిం మేకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్-204ను మండలంలోని ఎల్ఎండీ కాలనీలో శనివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 500లకు పైగా కళాకారులు, ఫిలిం మేకర్లు మంచి చిత్రాలు రూపొందిస్తూ దేశ వ్యాప్తంగా పేరు ప్రతిష్టలు సంపాదించడం సంతోషకరమన్నారు. క్రీడలు ఆరోగ్యానికి బాగా ఉపయోగపడతాయని చెప్పారు. కళాకారుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఎమ్మెల్యే సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ షార్ట్ మేకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అయిలు రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గన్నమనేని నర్సింగరావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి సీతామలక్ష్మి, ఇతర సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భార్యను కిడ్నాప్ చేశారంటూ భర్త ఫిర్యాదు

గొల్లపల్లి, జనవరి 27: మండలంలోని చెందోళి గ్రామంలో ఇంట్లో ఉన్న తన భార్య సౌమ్యను ఆమె కుటుంబ సభ్యులు మరికొందరు కలిసి అపహరించారని భర్త రేగుల రాకేష్ గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రేగుల రాకేష్, ఎనగందుల సౌమ్య ప్రేమించుకుని ఈ నెల 3వ తేదీన వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి ఇద్దరు కలిసి రాకేష్ ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో సౌమ్య తండ్రి ఎనగందుల చంద్రమౌళి, కట్కూరి రమేష్, దొనకొండ స్వామి ఇంటిలో ఉన్న సౌమ్యను బలవంతంగా తీసుకెళ్లారు.. భర్త రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ 27: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17, 19 క్రీడాకారుల టగ్ ఆఫ్ వార్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చెంజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం ఉదయం 9 గంటలనుంచి ఈ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల క్రీడాకారులు ఫొటోతో కూడిన అర్హత సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. అండర్-19 క్రీడాకారులు పదో తరగతి మెమోలతో హాజరుకావాలని ఆయన తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరు వాహనదారులకు జైలు

కరీంనగర్ క్రైం, జనవరి 27: కరీంనగర్‌లో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు జైలు శిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. మోతాదుకు మించి మద్యం సేవించి తనిఖీలలో పట్టుబడిన 15 మంది వాహనదారులను శనివారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి 5 రోజులు, మరొకరికి 3 రోజులు జైలుశిక్ష, రూ.3,500లు విధించారని తెలిపారు. మరో 13 మంది వాహనదారులకు రూ.21,500లు జరిమానా విధించినట్లు తెలిపారు.

గల్ఫ్ పంపిస్తానంటూ మోసం

- ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుల నిరసన



మెట్‌పల్లిలో నకిలీ వీసాలు చూపుతున్న బాధితులు

మెట్‌పల్లి, జనవరి 27: విదేశాలలో జీవనోపాధి కల్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన గల్ఫ్ ఏజెంట్ యేలేటి రమేష్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం బాధితులు ఆయన ఇంటి ఎదుట నిరసన తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో పనులు లేక ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లడానికి పట్టణంలోని యేలేటి రమేష్‌ను కొంత మంది సంప్రదించారు. సదరు ఏజెంట్ దుబాయ్‌కి పంపిస్తానని బాధితులు ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 60వేలు తీసుకొని వీసా కాపీలను ఇచ్చి పంపించాడు. వీసాలు తీసుకున్న బాధితులు ఎన్నో ఆశలతో దుబాయి వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బయల్దేరారు. తీరా అక్కడకు వెళ్లిన బాధితులకు అవి నకిలీ వీసాలని అధికారులు గుర్తించి తెలపడంతో షాక్‌కు గురయ్యారు. ఏజెంట్ చేతిలో మోసపోయినట్లు గుర్తించిన 40 మంది బాధితులు ఆగ్రహంతో ఏజెంట్ ఇంటికి చేరుకుని ఆందోళనకు దిగారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం

కరీంనగర్ క్రైం, జనవరి 27: నగరంలో వేర్వేరు చోట్ల ముగ్గురు వ్యక్తులు అదృశ్యం అయ్యారు. కరీంనగర్ మొహర్‌నగర్‌కు చెందిన కొండపల్లి జలపతి రావు(91) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదని మూడో టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. జలపతిరావును గుర్తించినవారు వెంటనే సీఐ 8712670763, టౌన్ 8331940596లకు సమాచారం అందించాలని కోరారు. జలపతిరావు కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

●కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ఆటోనగర్‌కు చెందిన గాజుపాక అంజయ్య(55) ఈ నెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి చేరలేదని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. అంజయ్య ఆచూకీ తెలిసిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అంజయ్య కొడుకు అరుణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

●కరీంనగర్ మంకమ్మతోటలో నివాసం ఉంటున్న కమలాకర్ ఆనంద్(51) శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంతవరకు ఆచూకీ లేకుండా పోయాడని ఆనంద్ భార్య సుస్మిత శనివారం ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని రెండో టౌన్ పోలీసులు తెలిపారు. ఆనంద్ ఒక ప్రైవేట్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. స్నేహితుడు డబ్బులు ఇస్తానన్నాడు, తీసుకుని వస్తానని తిమ్మాపూర్‌కు బయటుదేరి వెళ్లిన ఆనంద్ ఆచూకీ లేకుండా పోయాడని అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విజ్ఞానమేళాలో వింధ్యావాలి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న వింధ్యావాలి ప్రిన్సిపాల్ ప్రశాంత్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 27: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆన్‌లైన్ విజ్ఞానమేళాలో జిల్లా కేంద్రంలోని మెహర్‌నగరలో గల వింధ్యావాలి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ద్వితీయ స్థానం లభించింది. జిల్లా మొత్తంలో 262 ప్రాజెక్టులు ఈ విజ్ఞానమేళాలో పాల్గొనగా పాఠ శాల విద్యార్థినీలు సిహెచ్ నక్షత్ర, ఎ.శృతిషా రూపొందించిన హైడ్రాలిక్ జాక్ ఫర్ ఎల్డర్లీ పీపుల్ ప్రాజెక్టుకు జిల్లా స్థాయిలో రెండో స్థానం లభించిందని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కీర్తిని జిల్లాస్థాయిలో ఎగురవేసిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ ఆర్.పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ అభినందించారు.

కవి వేణుశ్రీకి పురస్కారం



తెలుగు భాషా విభూషణ్ పురస్కారం అందుకుంటున్న వేణుశ్రీ

కరీంనగర్ కల్చరల్, జనవరి 27: జిల్లాకు చెందిన కవి సుదర్శనం వేణుశ్రీకి శనివారం తెలుగు భాషా విభూషణ్ పురస్కార ప్రదానం చేశారు. అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్, హైదరాబాద్, అశోక్‌నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కృష్ణానంద డాక్టర్ పోతుకూచి సాంబశివరావు 96వ జయంతి వేడుకల సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో అవార్డుల ప్రదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శనం వేణుశ్రీకి తెలుగు భాషా విభూషణ్ పురస్కార ప్రదానం చేశారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 27: రిపబ్లిక్ డే సందర్భంగా మెహర్‌నగర్, వివేకానందపూర్ కాలని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు స్పందన లభించింది. విజేతలకు బహుమతులను ఆర్‌బీవీఆర్‌ఆర్ ఉమ్మడి జిల్లా రెడ్డి సంఘం ఉపాధ్యక్షురాలు కసిరెడ్డి రాణిరెడ్డి, సంగీతారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సూది శ్రీనివాస్‌రెడ్డి, శ్రీమాన్‌రెడ్డి పాల్గొన్నారు.

37 అంశాలకు పాలకవర్గం ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్, జనవరి 27: హుజూరాబాద్ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పాలకవర్గం 37 అంశాలకు ఆమోదం తెలిపింది. శనివారం చైర్‌పర్సన్ గందె రాధిక అధ్యక్షతన నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ 38అంశాలను ప్రస్తావించగా 37 అంశాలకు పాలకవర్గం ఆమోదం తెలిపిందని వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, మేనేజర్ రాంమోహన్‌రాయ్, ఏఈ సాంబరాజు, ఎం కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో చైర్మన్‌పై వీగిపోయిన అవిశ్వాసం

మానకొండూర్, జనవరి 27: మండలంలోని దేవంపల్లి సహకార సంఘం అధ్యక్షురాలు కసిరెడ్డి లతపై శనివారం పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. సహకార సంఘం అధ్యక్షురాలు లతపై డిసెంబరు 30న తొమ్మిది మంది డైరెక్టర్లు డీసీవోకు అవిశ్వాస నోటీస్ అందజేశారు. దీంతో సింగిల్ విండో కార్యాలయంలో ఉదయం 11గంటలకు చైర్మన్‌పై అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేశారు. కాగా డీసీవో రామానుజాచార్యులు, ఎవో కరుణాకర్, సూపరింటెండెంట్ శైలజ సమావేశానికి హాజరు అయ్యారు. సంఘంలోని 13 మంది సంఘం డైరెక్టర్లలో ఒక్కరూ కూడా ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశానికి హాజరు కాలేదు. కోరం లేక అవిశ్వాసం వీగిపోయిందని మరో ఏడాది పాటు చైర్మన్‌పై అవిశ్వాస నోటీస్ ఇవ్వరాదని డీసీవో తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాలకు హాజరైన గర్భిణులు

తిమ్మాపూర్, జనవరి27: మండలంలోని నుస్తులాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆవరణలో సర్పంచ్ రావుల రమేశ్ తన సొంత ఖర్చులతో పలువురు గర్భిణులకు ఘనంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ 21మందికి సామూహిక సీమంతలు నిర్వహించారు. గ్రామంలో పుట్టిన ప్రతీ ఆడపిల్లకి రమేష్ అన్న కానుకలో భాగంగా మరో 11మంది పిల్లల పేరున 5,116 రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బేతి శ్రీనివాస్‌రెడ్డి, సీడీపీవో సబిత, ఏసీడీపీవో అరవింద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, పద్మ, స్వరూప, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేద ఖైదీలకు న్యాయ సహాయం అందిస్తాం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేష్



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేష్

కరీంనగర్ క్రైం, జనవరి 27: ప్రైవేట్‌గా న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని పేద వర్గాలకు చెందిన ఖైదీలకు ప్రభుత్వమే న్యాయ వాదిని ఏర్పాటు చేస్తుందని జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ కార్యదర్శి కె వెంకటేష్ అన్నారు. ఆయన శనివారం కరీంనగర్ జిల్లా జైలును సందర్శించి, ఖైదీల యోగక్షేమాలను, వారికి అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖైదీలు ప్రైవేట్ న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే స్తోమతలేనివారు కోరితే న్యాయ వాదిని ఏర్పాటు చేస్తామన్నారు. జైలు ఆవరణలోని క్యాంటిన్, లైబ్రరీ, పరిశ్రమల విభాగం, ములాఖత్, ఫోన్ సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం పోక్సోయాక్టు, ఎన్‌డీపీఎస్, మోటార్ వేమికల్ యాక్టు, సీనియర్ సిటిజన్ యాక్టు, 498-ఏ యాక్టు వంటి చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలపట్ల, జైలు అధికారులు, సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలు జైలు సూపరిం టెండెంట్ జి.సమ్మయ్య, జైలర్లు పి.శ్రీనివాస్, బి.రమేష్, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ సుధాకర్‌రెడ్డి, ఎల్.రమేష్, లీగల్‌ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ తనుకు మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కరీంనగర్ అర్బన్, జనవరి27: కరీంనగర్ బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ మల్లికార్జు రాజేందర్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరా బాద్‌లోని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో శనివారం ఉదయం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ టి సంతోష్‌కుమార్‌లు బీఆర్‌ఎస్ నాయకులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో 14వ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు జంగ శరత్ చంద్ర, వాసర హాస్పిటల్ చైర్మన్ నాగాసముద్రం వాసరయ్య, నాగసముద్రం పురుషోత్తం, బీఆర్‌ఎస్ నాయకులు యాగండ్ల అనిల్ కుమార్, సిద్ది లక్ష్మణ్, వెంకటేశం, రంగు చెన్నయ్యగౌడ్, పంజాల వెంకన్న, నవీన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షులు మునిగంటి అనిల్, 55వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడమల్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

●చొప్పదండి: మండలంలోని కొలిమికుంటకు చెందిన బిఆర్‌ఎస్ నాయకుడు కాంగ్రెస్ పార్టీలో చేరాడు. హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో ఆయన పార్టీలో చేరాడు. మాజీ వైస్ చైర్మన్ గౌడ సంఘం జిల్లా అధ్యక్షునిగా పనిచేసిన తాల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు.

నేడు గోదారంగనాథ కల్యాణం

కరీంనగర్ కల్చరల్, జనవరి 27: నగర శివారులోని వేదభవనంలో త్రిదండి అహోబిల రామానుజ జీయరుస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆదివారం ఉదయం 10-30 గంటల నుంచి వికాసతరంగిణి ఆధ్వర్యంలో గోదారంగనాథ కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కెగౌతమరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8-30 గంటలకు తీర్థగోష్ఠి ఉంటుందని, కల్యాణం అనంతరం తీర్థప్రసాద వితరణ, అన్నదానం జరుగుతుందని పేర్కొన్నారు. వికాసతరంగిణి, జెట్ బాధ్యులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

చిగురుమామిడి, జనవరి 27: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి శనివారం తెలిపారు. రేకొండ గ్రామంలో సొసైటీ గోదాములు ప్రారంభోత్సవం, గాగిరెడ్డిపల్లి, సీతారాంపూర్, గునుకులపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మాణాం చేసిన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభిస్తారన్నారు.

ఎలగందల్ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ రూరల్, జనవరి 27: జాతీయ స్థాయి ఆర్ట్ పోటీల్లో కొత్తపల్లి మండలం ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి అవార్డులు సొంతం చేసుకున్నారు. రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ముంబాయి వారి ఆధ్వర్యంలో 2023 సంవత్సరంలో నిర్వహించిన కలరింగ్, చేతిరాత, ఆర్ట్, టాటు ఆర్ట్ విభాగాల్లో పది బంగారు పతకాలు, ఐదు కంచు పతకాలతో పాటు అవార్డులు, ప్రశంసాపత్రాలు సాధించారు.

శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయులు టి.ఆనందంను, ఆర్ట్ ఉపాధ్యాయుడు మహేష్‌బాబును స్థానిక ప్రజా ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ షర్మిలప్రకాశ్, ఎంపిటీసి రమేష్, ఉపసర్పంచ్ బినరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లెనిన్ స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, జనవరి 27: లెనిన్ స్ఫూర్తితో శ్రామిక వర్గం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లాకార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ముకుందలాల్‌మిశ్రా భవన్‌లో గీట్ల ముకుందరెడ్డి అధ్యక్షతన వర్తమాన పరిస్థితులు, లెనినిజం ప్రాధాన్యం అనే అంశంపై సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో నూతన అధ్యాయానికి నాందిపలికిన విప్లవ ఉద్యమాల కాంతి శిఖరం లెనిన్ అన్నారు.

కార్మికులు, కర్షకులు, శ్రామికులు ఐక్య ఉద్యమాలకు, పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు నాయకత్వం వహించేది ఎర్ర జెండా మాత్రమేనని సీపీఎం జిల్లాకార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి న్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వర్ద వెంకట్‌రెడ్డి, గుడికందుల సత్యం, బీమాసాహెబ్, ఆర్.రాజేశం, డి.నరేష్, తిప్పారపు సురేష్, కోనేటి నాగమణి, గజ్జల శ్రీకాంత్, పుల్లెల మల్లయ్య, కాల్వ సురేష్, యాదగిరి కొంపెల్లి సాగర్, కె.అరవింద్, కనకరాజు, విపిన్‌కుమార్, చందు, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల అభివృద్ధికి కృషి

కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మెడికల్ కళాశాల అభివృద్ధి కోసం నిధుల మంజూరుకి కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొత్తపల్లిలోని జిల్లా మెడికల్ కళాశాలలో ఫ్రెషర్స్ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ దేశం నలుమూలల నుండి వైద్య విద్యా అభ్యసించ డానికి వచ్చిన విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, ఆర్డీవో మహేశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సెయింట్‌జాన్స్ స్కూల్‌లో క్రీడా సంబరాలు



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 27: నగరంలోని పురాతన సెయింట్‌జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో శనివారం 61వ వార్షికోత్సవ క్రీడా సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ హాజరై వేడుకలను ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రొవెన్షి యల్ సుపీరియర్ సీఎస్‌ఏ ప్రొవిన్స్ కె మార్గరేట్ మాట్లాడుతూ ఈ యేడు నుంచి పాఠశాలలో ఒకటి నుంచి 5 తరగతుల వరకు సీబీఎస్‌ఈ సిలబస్‌ను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మధుసూదనాచారి, సెయింట్ జాన్స్ అలూమిని సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తెహ్మినాఖాన్, లూర్దుమాత చర్చ్ ఫాదర్ ఆర్ థామస్, కరస్పాండెంట్ జి జోసెఫ్‌మేరీ, హెచ్‌ఎం ఇన్నాలు, వొంటెల సత్యనారాయణ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామాన్యులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- ఆరు గ్యారంటీలను నెరవేరుస్తాం - ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



గన్నేరువరంలో ఎమ్మార్సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గన్నేరువరం, జనవరి 27, సామాన్యులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. చొక్కారావుపల్లిలో నూతన గ్రామపంచాయితి భవనానికి, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గన్నేరువరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన మండల వనరుల కేంద్రం (ఎమ్మార్సీ), డైనింగ్ హాల్, సైన్స్ ల్యాబ్‌లను ప్రారంభించారు. సాంబయపల్లిలో గ్రామపంచాయితి భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. మైలారం గ్రామంలో మహిళాసంఘ భవనాన్ని ప్రారంభించారు. గునుకుల కొండాపూర్‌లో రజక సంఘ భవనానికి భూమిపూజ చేసి ఆరె సంఘ భవనాన్ని ప్రారంభించారు. గుండ్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలకు నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను ప్రారంభించారు. అంతకుముందు మైలారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను త్వరలోనే నెరవేర్చుతామని చెప్పారు. గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు డబుల్ రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, తహసీల్దారు భిక్షపతి, ఎంపీడీవో స్వాతి, ఎంఈవో శ్రీనివాస్, ఏవో కిరణ్మయి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, సునీల్, అనంతరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు పుల్లెల లక్ష్మిలక్ష్మణ్, కరుణాకర్‌రెడ్డి, దుడ్డు రేణుక మల్లేశం, నరసింహారెడ్డి, బేతెల్లి సమతరాజేందర్ పాఠశాల ఎచ్‌ఎం రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల పంటలను కాపాడాలి

- మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, జనవరి 27: ఎల్లంపల్లి నీటిని విడుదల చేసి చొప్పదండి నియోజకవర్గ ఆయ కట్టును కాపాడాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చర్లపల్లి పరిధిలోని కుర్మపల్లి గ్రామంలో శనివారం ఆయన ఎండిపోతున్న పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం చొప్పదండి నియోజకవర్గంలో పొలాలు ఎండుతుంటే పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ ఆధారం చేసుకుని వేసిన లక్షల ఎకరాల వరి పొలలాలు ఎండముఖం పట్టనున్నాయి. తక్షణం సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి నారాయణపూర్‌కు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో నీరు విడుదల చేయకపోతే రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు నారాయణపూర్‌కు ఎల్లంపల్లి నీరు

గంగాధర, జనవరి 27: నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఆదివారం ఎల్లంపల్లి ఎల్లంపల్లి నీరు విడుదల చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. శనివారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. రెండు రోజుల క్రితం మేడారం పంపు హౌస్ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసి నీటిని విడుదల చేయాలని ఈఎన్‌సీని కోరినట్లు తెలిపారు. మేడారం పనులు పూర్తికాగా నీటి విడుదలకు అడ్డంకులు తొలిగినట్లు ఆయన తెలిపారు. ఆదివారం అధికారులు ఎల్లంపల్లి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా నీరు విడుదల కానున్న సందర్భంగా రిజర్వాయర్ ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

నేడు హుజూరాబాద్‌కు ఎమ్మెల్సీ కోదండరాం రాక

హుజూరాబాద్, జనవరి 27: హుజూరాబాద్ పీవీ జిల్లా సాధన సదస్సుకు ఆదివారం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాజ హాజరవుతున్నారని జిల్లా సాధన జేఏసీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో పీవీ జిల్లా సాధన సమితి సదస్సుకు భారీ ఎత్తున మేధావులు, తెలంగాణ వాదులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

'మంత్రి పొన్నంపై ఆరోపణలు సరికాదు'

సైదాపూర్, జనవరి 27: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అసత్యపు ఆరోపణలు సరికాదని సైదాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం పలువురు విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం హుస్నాబాద్‌లో సతీష్‌కుమార్ మంత్రి పొన్నంను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని చెప్పారు. వీటిని మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, జిల్లా సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మిట్టపెల్లి కిష్టయ్య, జిల్లా నాయకుడు ఊసకోయిల రాఘవులు, జిల్లా అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్, నాయకులు దస్తగిరి, బొమ్మగాని రాజు, సారబుడ్ల రాజిరెడ్డి, లంకదాసరి మల్లయ్య, కొత్త మల్లారెడ్డి, పర్కాల రమేష్, అనగోని శ్రీనివాస్, యాదగిరిరాజు, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మహత్య చేసుకుంటాం అంటే ఓట్లు వేశారు'



మాట్లాడుతున్న పత్తి కృష్ణారెడ్డి

జమ్మికుంట, జనవరి 27: ఆత్మహత్య చేసుకుంటాం అంటే ప్రజలు ఓట్లు వేశారని టీపీసీసీ సభ్యులు పత్తి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన ఇలేఖరుల సమాశంలో ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గంలో పాడి కౌశిక్‌రెడ్డి సెంటిమెంట్‌తో ఓట్లు సంపాదించారని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టింది సొంత పార్టీ వారని తెలిపారు. ప్రజలకు ఏం చెప్పి గెలిచాడో పక్కన పెట్టి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం బాధాకరం అన్నారు. గతంలో సొంత పార్టీ నాయకులను కొనుగోలు చేసిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకి ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని మున్సిపాల్టీలపై అవిశ్వాసం పెట్టి నెగ్గే అవకాశం కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. చట్టం తెలుసుకోకుండా ఎమ్మెల్యే విప్ జారీ చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేష్‌నగర్, జనవరి27: నగరంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్‌కుమార్ తెలిపారు. 11కేవీ సాయికృష్ణ ఫీడర్ పరిధిలో గీతాభవన్ నుంచి మున్సిపల్ ఆఫీసు వరకు, పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఏరియా, ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా, బస్టాండ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

బేస్‌బాల్ పోటీలకు మానేరు విద్యార్థి ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 27: చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కోర్బాలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 1వరకు జరగనున్న 67వ జాతీయస్థాయి పాఠశాలల అండర్-14 బేస్‌బాల్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థి అక్షయ్‌కార్తిక్ ఎంపికయ్యాడని పాఠశాల పీఈటీ సిలువేరి మహేందర్ తెలిపారు. ఇటీవల తొర్రూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభచాటిన ఆయన జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పేర్కోన్నారు. ఈ సందర్భంగా అక్షయ్‌కార్తిక్‌ను మానేరు విద్యాసంస్థల అధినేత కడారు అనంతరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మానేరువిద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతరెడ్డి, ప్రిన్సిపాల్ సరితరెడ్డి, పీఈటీలు మహేందర్, జహెద ఉపాధ్యాయ బృందం పాల్గొని అభినందించారు.

కబడ్డీ పోటీలకు పారమిత విద్యార్థి ఎంపిక

కరీంనగర్, స్పోర్ట్స్ 27: ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా రాయిపూర్‌లో ఈనెల 28 నుంచి 31వరకు జరగనున్న జాతీయ స్థాయి అండర్-14 కబడ్డీ పోటీలకు జిల్లా కేంద్రంలోని పారమిత పాఠశాల విద్యార్థిని అర్రై కృతికశ్రీ ఎంపికైంది. ఇటీవల జనగామలో జరిగిని రాష్ట్ర స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన ఆమె జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైం దని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ ప్రసాద్‌రావు, డైరెక్టర్లు అభినందించారు.

రక్తదానం

కరీంనగర్ టౌన్, జనవరి 27: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా వైస్ చైర్మన్, లయన్ పూర్వ జిల్లా గవర్నర్ చిదుర సురేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం నగరంలోని వైశ్యభవన్‌లో ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న 26 మంది ప్రైవేట్ ఉద్యోగులు రక్తదానం చేశారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో బాలాజీ అన్నపూర్ణ సమితి, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 600మందికి వేర్వేరు అల్పాహారం పంపిణీ చేశారు. వాసవీ వృద్ధాశ్రమంలో అన్నదాన వితరణ చేశారు. జిల్లా కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు రెడ్‌క్రాస్ మెంబర్ ఎలగందుల మునీందర్ ఆధ్వర్యంలో 56మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. లయన్ చింతల కిషన్ పటేల్ ఆధ్వర్యంలో బొమ్మకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 50 మంది విద్యార్థులకు భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ చిదుర సురేశ్, సెక్రెటరీ పూట్కూరి రాధాకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్ది విద్యాసాగర్, ఎలగందుల మునీందర్, సాన వేణు, వైశ్య సేవా కేంద్రం డైరెక్టర్ రామిడి శ్రీధర్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

భగత్‌నగర్, జనవరి 27: అయోధ్య రామయ్య చిత్ర లేఖన పోటీల్లో విజేతలకు బీజేపీ జాతీయప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ శనివారం బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. తెలంగాణ ఆర్ట్స్ ఫిజికల్ వర్క్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రామమందిరం ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని పోటీలు నిర్వహిం చారు.

పారమిత విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ రూరల్, జనవరి 27: సీబీఎస్‌ఈ నేషనల్ గణిత చాలెంజ్ పోటీల్లో పారమిత విద్యార్థులు ప్రతిభచాటారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) బోర్డు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఆర్యభట్ట గణిత ఛాలెంజ్ పోటీలలో పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రసాదరావు అభినందించారు.

● సంక్షిప్త సమాచారం..

● హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణం లోని పలు దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు శనివారం మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ వినయ్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా నాలుగు కిరాణం షాపులలో ప్లాస్టిక్ కవర్లు దొరకడంతో రూ. 9వేల జరి మానా విధించారు.

- హుజూరాబాద్ మండలం రంగాపూర్‌లో నేషనల్ హైవే రోడ్ క్రాసింగ్ పనులు చేపడుతున్నందున సోమ, మంగళవారాల్లో జమ్మికుంట, ఇల్లందకుంట, హుజూరాబాద్ మండలాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

● సైదాపూర్: హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో ఇంగ్లాం డ్-ఇండియా క్రికెట్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా తిలకించేందుకు సైదాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ టికెట్లు కొని ఇవ్వడంతో పాటు రవాణా సౌకర్యం, ఇతర సౌకర్యాలు కల్పించినట్లు పీఈటీ విష్ణువర్ధన్ తెలిపారు.

● జమ్మికుంట రూరల్, జనవరి 27: జమ్మికుంట పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని శనివారం నిర్వహించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఆవిర్నేని సుధాకర్‌రావు ఉపాధ్యాయులు అభినందించారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాల యంలో వైద్య సిబ్బందిని సర్పంచ్ గూడూరి ప్రతాపరెడ్డి సన్మానించారు. ఐదేళ్ల సర్పంచ్ పాలనలో వైద్య సిబ్బంది మెరుగైన సేవలందించినందుకు గానూ సన్మానించారు. సన్మానించిన వారిలో డాక్టర్ పంజాల స్నిగ్ధ, ఆరోగ్య పర్యవేక్షకుడు రమేష్, ఏఎన్‌ఎం సి.వజ్ర, మోరే కవిత తదితరులు ఉన్నారు.

● గంగాధర: బాలికలకు ఉన్నత విద్యనందిస్తే వారి భవితకు భరోసా కల్పించిన వారవుతారని ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి అన్నారు. శనివారం ఐకేపీలో అంత ర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురష్కరించుకుని నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

- మండలంలో వేసవికి ముందే భూగర్భ జలాలు అడుగంటి పొలాలు తడారుతున్నాయి. గంగాధర మండలం చర్లపల్లి, ర్యాలపల్లి, కుర్మపల్లి, లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్ గ్రామాల్లో పొలాలకు నీరందడంలేదు. బావుల్లో నీరు అడుగంటి రెండు మూడు రోజులకు ఒకసారి రైతులు పొలాలకు తడులందిస్తున్నారు. ఎల్లంపల్లి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

● మానకొండూర్ : మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు డెంగీతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో వైద్యబృందం సందర్శించింది.

- మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సైన్స్ పరీక్షను నిర్వహించారు.